సాక్షి
నల్లగొండ

గురువారం । 2 । అక్టోబర్ । 2025

న్యూస్‌రీల్

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు



పెద్దఅడిశర్లపల్లి : బాలాజీనగర్‌లో నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి

పెద్దఅడిశర్లపల్లి, తిరుమలగిరి(నాగార్జునసాగర్) : ఉపాధి హామీ సిబ్బంది విధుల పట్ల అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం పెద్దఅడిశర్లపల్లి మండలం బాలాజీనగర్‌లో నర్సరీని పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్‌లతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఆ తర్వాత తిరుమలగిరి(నాగార్జునసాగర్) మండలం అల్వాల గ్రామంలోని నర్సరీ పరిశీలించారు. అవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా నాటేందుకు ఐదుఫీట్ల పొడవు గల మొక్కలను వచ్చే ఏడాది జూన్ నాటికి సిద్ధం చేయాలన్నారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట పీఏపల్లి ఎంపీడీ చంద్రమౌళి, ఏపీఓ శ్రీనివాస్, ఏపీఎం నాగలీల, ఈసీ దశరధరెడ్డి, తిరుమలగిరి సాగర్ మండల ఏపీఓ శ్రీను, ఏపీఎం రాజేశ్వరి, పంచాయతీ కార్యదర్శి సైదానాయక్, శ్రీరాములు ఉన్నారు.

టోల్‌ప్లాజా వద్ద వాహనాల రద్దీ



టోల్‌ప్లాజా వద్ద బారులుదీరిన వాహనాలు

కేతేపల్లి: హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై కేతేపల్లి మండలం కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద బుధవారం వాహనాల రద్దీ కొనసాగింది. గురువారం దసరా పండుగ కావడంతో హైదరాబాద్ నుంచి స్వగ్రామాలకు వెళ్తుండడంతో రద్దీ నెలకొంది. వాహనాల రద్దీకి అనుగుణంగా టోల్‌ప్లాజా వద్ద నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఫాస్టాగ్ చిప్‌ను రెండు, మూడు సెకన్లలోనే స్కాన్ అయ్యేలా స్కానర్లను అప్‌డేట్ చేశారు. దీంతో భారీ సంఖ్యలో వాహనాలు వస్తున్నప్పటికీ టోల్‌ప్లాజా వద్ద ఎలాంటి ఇబ్బందులు ఎదురవ్వలేదు.

నేత్రపర్వంగా గజవాహన సేవ

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో నిత్యారాధనలో భాగంగా గజవాహన సేవ నేత్రపర్వంగా చేపట్టారు. బుధవారం వేకువజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు.. స్వామివారి మేల్కొలుపులో భాగంగా సుప్రభాత సేవ నిర్వహించారు. అనంతరం గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేకం, తులసీదళ అర్చన జరిపించారు.

విధులు సమర్థవంతంగా నిర్వహించాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ: గ్రామ పంచాయతీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల సందర్భంగా ఏర్పాటుచేసిన ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ బృందాలు తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం నల్లగొండ కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో ఎన్నికల వ్యయ నిర్వహణ కమిటీలు, ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ బృందాలతో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. అక్రమంగా డబ్బులు, మద్యం, బహుమతులు వంటివి పంపిణీ కాకుండా గట్టి నిఘా ఉంచాలని ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా నగదు, మద్యం తీసుకెళ్తే సీజ్ చేయడం, సీజైన సామగ్రి మొత్తాన్ని వీడియో తీసి రోజూ నివేదిక పంపించాలని సూచించారు. పట్టుకున్న నగదు, మద్యం సమీప పోలీస్ స్టేషన్లో డిపాజిట్ చేయాలని చెప్పారు. నగదు సీజ్ చేసే సమయంలో వైద్య, వివాహ, ఇతర శుభకార్యాలకు తీసుకెళుతున్నారా అనేది నిర్ధారించుకుని కేవలం ఎన్నికలకు సంబంధించిన నగదు అయితేనే సీజ్ చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్, ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నారాయణ అమిత్, జెడ్పీ సీఈఓ శ్రీనివాసరావు, డీపీఓ వెంకయ్య, ఇన్‌చార్జి డీఆర్‌ఓ వై.అశోక్‌రెడ్డి, గృహ నిర్మాణ పీడీ రాజ్‌కుమార్, మాస్టర్ ట్రైనర్ బాలు, అధికారులు పాల్గొన్నారు.

జయజయహే మహిషాసుర మర్ధిని



కనగల్: దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం కనగల్ మండలం దర్వేశిపురం గ్రామంలోని రేణుక ఎల్లమ్మ అమ్మవారు భక్తులకు మహిషాసురమర్ధినిగా దర్శనమిచ్చారు.

నేడే విజయదశమి

- దసరా ఉత్సవాలకు సిద్ధమైన ప్రజలు
- నందడిగా మారిన పట్టణాలు, పల్లెలు
- రద్దీగా బస్టాండ్లు, రహదారులు
- శమీ పూజ, రావణ దహనానికి ఏర్పాట్లు

రామగిరి(నల్లగొండ): దసరా వేడుకలు ఘనంగా జరుపుకునేందుకు జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా ఆలయాలు, ప్రధాన కూడళ్లు, కార్యాలయాలు, పరిశ్రమల్లో శమీ, ఆయుధ పూజలకు ఏర్పాట్లు చేసుకున్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దసరా పండుగను జరుపుకుంటారు. ప్రధానంగా దుర్గాదేవిని శక్తి స్వరూపిణిగా ఆరాధించడం ఈ పండుగ ప్రత్యేకత.

దుకాణాలలో కోలాహలం

జిల్లాలోని అన్ని పట్టణాలు, మండల కేంద్రాల్లోని దుకాణాలు, వివిధ మార్కెట్లు కొనుగోలుదారులతో కోలహలంగా మారాయి. జీఎస్టీ తగ్గడంతో బైకులు, కార్లు కొనుగోలు చేసేందుకు చాలా మంది ఆసక్తి చూపుతున్నారు. దీంతో బైకులు, ఎలక్ట్రికల్, వస్త్ర, ఫుట్‌వేర్, లేడీస్ ఎంపోరియం, పూలు, పండ్లు, కూరగాయల దుకాణాలు రాత్రి పొద్దుపోయే వరకు వినియోగదారులతో కిటకిటలాడాయి.

రహదారులపై వాహనాల రద్దీ

నల్లగొండ, మిర్యాలగూడ, నకిరేకల్, దేవరకొండ, హాలియా వంటి పట్టణాల్లో జాతీయ రహదారులు వాహనాలతో రద్దీగా మారాయి. షాపింగ్ చేసేందుకు ప్రజలు గ్రామాల నుంచి పెద్ద ఎత్తున తరలిరావడంతో పట్టణాల్లో ట్రాఫిక్ నెలకొంది. హైదరాబాద్ నుంచి స్వగ్రామాలకు వెళ్లేందుకు పయనం కావడంతో జాతీయ రహదారులపై వాహనాల రద్దీ ఏర్పడింది. ఆర్టీసీ బస్టాండ్లు ప్రయాణికులతో రద్దీగా కనిపించాయి.



నల్లగొండలోని శంకర గోశాలలో శమీ పూజ కోసం జమ్మి చెట్టుకు అమ్మవారి అలంకరణ

రావణ దహనానికి భారీ కటౌట్‌లు

చాలామంది దసరా రోజు సాయంత్రం పాలపిట్టను చూస్తారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన లేదా సహజంగా ఉన్న జమ్మి వృక్షం వద్దకు వెళ్లి పూజలు చేసి శుభాకాంక్షలు తెలుపుకుంటారు. దీంట్లో భాగంగా నిర్వహించి రావణ దహనానికి భారీ కటౌట్లు సిద్ధం చేసుకున్నారు.



నల్లగొండలోని ప్రకాశం బజార్‌లో పండుగ రద్దీ

టైగర్ దామన్న ఇక లేరు

- హైదరాబాద్‌లో కన్నుమూసిన మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి
- కమ్యూనిస్టుల కంచుకోటలో కాంగ్రెస్‌కు జవసత్వాలు నింపిన నేత
- తుంగతుర్తి నుంచి నాలుగుసార్లు, సూర్యాపేట నుంచి ఒకసారి ఎమ్మెల్యేగా విజయం
- గోదావరి జలాల సాధకుడిగా పేరు
- 4న తుంగతుర్తిలో అంత్యక్రియలు





తుంగతుర్తిలో గోదావరి జలాలకు పూజలు చేస్తున్న అప్పటి సీఎం వైఎస్సార్‌తో దామోదర్‌రెడ్డి (ఫైల్)

సూర్యాపేట : టైగర్ దామన్నగా తుంగతుర్తి, సూర్యాపేట ప్రాంతాల్లో పేరుగాంచిన మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అనారోగ్యంతో బుధవారం రాత్రి తుది శ్వాస విడిచారు. ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం లింగాలలో ఆయన జన్మించారు. తుంగతుర్తి గ్రామానికి చెందిన ఉప్పునూతల కౌసల్యాదేవి కుమార్తె వరూధినిదేవిని వివాహమాడారు. ఆయనకు కుమారుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి ఉన్నారు. ఖమ్మం జిల్లాకు చెందిన మాజీ మంత్రి దివంగత రాంరెడ్డి వెంకట్‌రెడ్డికి స్వయానా సోదరుడు. దామోదర్‌రెడ్డి 1985 నుంచి నేటి వరకు కాంగ్రెస్ పార్టీలో కీలక నాయకుడిగా పనిచేశారు. పార్టీకి ఎంత కష్ట కాలం వచ్చినప్పటికీ పార్టీని వీడకుండా తుంగతుర్తి, సూర్యాపేట ప్రాంతాల్లో కార్యకర్తలకు అండగా నిలిచారు.

కమ్యూనిస్టుల కంచుకోటలో..

1985 నాటికి తుంగతుర్తి ప్రాంతంలో కమ్యూనిస్టు ప్రాబల్యంతోపాటు కాంగ్రెస్ పార్టీలో అనేక చీలికలు పేలుకలు ఉండడంతో కమ్యూనిస్టులను ఓడించడం ఎవరికి సాధ్యం కాలేదు. ఈ నేపథ్యంలో ఎర్రపహాడ్ జమీందారు జన్నారెడ్డి శ్యాంసుందర్‌రెడ్డికి స్వయంగా బావమరిది అయిన రాంరెడ్డి దామోదర్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ రంగంలోకి దించింది. 1985లో దామోదర్‌రెడ్డి మొదటిసారి తుంగతుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. అప్పటిదాకా తుంగతుర్తి నియోజకవర్గం కమ్యూనిస్టుల కంచుకోటగా ఉండేది. 1989లో మరోసారి గెలుపొందారు. మూడోసారి 1994లో కాంగ్రెస్ పార్టీ టికెట్ రాకపోవడంతో ఇండిపెండెంట్‌గా బరిలో నిలిచి సీపీఎం అభ్యర్థిపై విజయం సాధించారు. నాలుగోసారి 1999లో కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచి టీడీపీ అభ్యర్థి సంకినేని వెంకటేశ్వర చేతిలో ఓటమిపాలయ్యారు. తిరిగి 2004లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి అదే సంకినేని వెంకటేశ్వరరావుపై విజయం సాధించారు. ఈసారి వైఎస్ రాజశేఖరరెడ్డి మంత్రివర్గంలో చోటు దక్కించుకున్నారు. అనంతరం 2009లో నియోజకవర్గాల పునర్విభజనలో తుంగతుర్తి నియోజకవర్గం ఎస్సీకి రిజర్వు కావడంతో.. సూర్యాపేట నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిచి టీఆర్ఎస్ అభ్యర్థి పోరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిపై విజయం సాధించారు. 1985 నుంచి వరుసగా తుంగతుర్తి నుంచి మూడుసార్లు గెలుపొంది ఒకసారి ఓటమి చవిచూసి మరోసారి గెలుపొంది నాలుగుసార్లు విజయం సాధించారు. అనంతరం సూర్యాపేట నుంచి 2009లో మరోసారి విజయం సాధించి మొత్తంగా ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1985, 1989, 1994లో తెలుగుదేశం మిత్రపక్షాల హవాలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అన్ని స్థానాలు గెలుపొందగా.. కేవలం తుంగతుర్తి నియోజకవర్గంలో మాత్రమే దామోదర్ రెడ్డి గెలుపొంది కాంగ్రెస్ సత్తా చాటారు. 1985 కంటే ముందు తుంగతుర్తి ప్రాంతంలో కమ్యూనిస్టుల హవా కొనసాగి భీంరెడ్డి నరసింహారెడ్డి, మల్లు స్వరాజ్యం ఎమ్మెల్యేలుగా పనిచేయగా దామోదర్ రెడ్డి రంగ ప్రవేశంతో కమ్యూనిస్టుల ప్రాబల్యానికి గండి కొట్టినట్లు అయింది. ఎమ్మెల్యేగా, మంత్రిగా ప్రాతినిధ్యం వహించి అసెంబ్లీ టైగర్ గా పేరుగాంచిన దామోదర్ రెడ్డి కనుమూయడంతో తుంగతుర్తి, సూర్యాపేట ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీ పెద్ద దిక్కును కోల్పోయింది.

మద్యం, మాంసం దుకాణాలు బంద్

- దసరా పండుగ రోజే గాంధీ జయంతి రావడంతో విక్రయాలు నిలిపివేత
- ఆయా దుకాణాలు మూసేయాలని ఎక్సైజ్, మున్సిపల్ శాఖల ఆదేశాలు
- ఇప్పటికే దుకాణదారులకు నోటీసులు జారీ
- చుక్క, ముక్కపై జనంలో సందిగ్ధం



నల్లగొండలో మటన్ దుకాణదారుడికి నోటీసులు అందిస్తున్న మున్సిపల్ సిబ్బంది

నల్లగొండ టూటౌన్: ఈ సారి దసరా (విజయదశమి) పండుగపై గాంధీ జయంతి ప్రభావం పడనుంది. తెలంగాణలో అత్యంత ప్రాముఖ్యత ఇచ్చి జరుపుకునే పెద్ద పండుగ దసరా. ఆడపడుచులు, కొత్త అల్లుళ్లతోపాటు దగ్గరి బంధువులను పిలిచి ఇంటిల్లిపాది ఆనందంగా జరుపుకునే పండుగ ఇది. తెలంగాణలో పండుగ ఏదైనా ముక్క, చుక్క ఉండాల్సిందే. ఈ సారి దసరా పండుగ రోజే జాతిపిత మహాత్మాగాంధీ జయంతి రావడంతో ఆ రోజు మాంసం, మద్యం దుకాణాలు మూసివేయాలని మున్సిపల్, ఎక్సైజ్ శాఖల అధికారులు నోటీస్‌లు జారీచేశారు. దాంతో పండుగ పూట మందు, మాంసం, చికెన్ విక్రయాలు బంద్ కానున్నాయి. దీంతో పండుగ రోజు కొత్త అల్లుళ్లకు పప్పు, కూరగాయల వంటలతోనే సరిపెట్టాల్సిన పరిస్థితులు వచ్చాయని అందరూ చర్చించుకుంటున్నారు.

దుకాణాల మూసివేతకు నోటీసులు జారీ

మామూలు రోజుల్లోనే ముక్క, చుక్క లేనిదే ముద్ద దిగదని మద్యం, మాంసం ప్రియులకు ఈ సారి దసరా కిక్కు లేకుండా పోసింది. ఆ రోజే గాంధీ జయంతి రావడంతో మాంసం, మద్యం దుకాణాలు, రెస్టారెంట్లు, హోటల్స్ మూసి వేయాలని మున్సిపల్ అధికారులు రెండు రోజుల ముందుగానే నోటీస్‌లు జారీ చేశారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని మున్సిపల్ అధికారులు ముందుగానే హెచ్చరికలు జారీ చేశారు. దీంతో చుక్క, ముక్కకు ఎక్కడికి వెళ్లాలనే మీ మాంసలో ఉన్నారు జనం. అయితే దసరా పంగుడ రోజు కొన్ని వేల టన్నుల మాంసం విక్రయాలు జరుగుతుంటాయి. గ్రామాల్లో యాట (మటన్) మాంసం లేని ఇల్లు ఉండదు. అలాగే మద్యం దుకాణాల్లో రోజంతా కోట్ల రూపాయల్లో వ్యాపారం జరిగే పండుగ ఇది. ఈ సారి దసరా పండుగ, గాంధీ జయంతి రెండు ఒకేరోజు రావడంతో భారీ ఎత్తున జరిగే మద్యం, మాంసం విక్రయాలపై ప్రభావం పడనుంది.

దుకాణాలు తెరిస్తే జరిమానా

ఈ సారి దసరా పండుగ రోజు గాంధీ జయంతి వచ్చిన నేపథ్యంలో మాంసం, మద్యం దుకాణాలు మూసివేయాలి. హోటల్స్, రెస్టారెంట్స్, మాంసం వ్యాపారులకు విక్రయాలు జరుపవద్దని నోటీసులు జారీ చేశాం. దుకాణాలు తెరిస్తే చర్యల్లో భాగంగా జరిమానా విధిస్తాం.

– సయ్యద్ ముసాబ్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్

ముందస్తుగా మద్యం కొనుగోళ్లు

దసరా పండుగను దృష్టిలో పెట్టుకున్న కొందరు మద్యంప్రియులు ముందస్తుగా మద్యం కొనుగోలు చేస్తున్నారు. కానీ యాట పోతులు మాత్రం ముందు రోజు కోయకపోవడం, కోసినా మరుసటి రోజు తినడానికి ఎవరు ఆసక్తి చూపే అవకాశం ఉండని కారణంగా మాంసం ప్రియులకు కొంచెం ఇబ్బందికర పరిస్థితులు వచ్చాయి. దీంతో ఎక్కువ మంది మాత్రం దసరా రోజు శాకాహారంతో పండుగ చేసుకొని ఆ మరుసటి రోజు మద్యం, మాంసంతో పండుగ చేసుకునేందుకు మొగ్గు చూపుతున్నారు.



రెయిన్ గేజ్ పరికరాన్ని పరిశీలిస్తున్న సర్వే ఆఫ్ ఇండియా అధికారి, తహసీల్దార్

ప్రభుత్వ ఆస్తులను బాధ్యతగా కాపాడాలి

నిడమనూరు : ప్రభుత్వ ఆస్తులను ప్రతిఒక్కరూ బాధ్యతగా కాపాడాలని సర్వే ఆఫ్ ఇండియా ఉన్నతాధికారి దెబ్రిక్ పాతక్ అన్నారు. వాతావరణంలోని మార్పులు, ఉష్ణోగ్రతలు, వర్షం నమోదుకు నిడమనూరు మండల పరిషత్ ప్రాంగణంలోని ఏర్పాటు చేసిన రెయిన్‌గేజ్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో అధికారులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా సర్వే ఆఫ్ ఇండియా 70 కిలోమీటర్ల విస్తృతిలో ఒకటి చొప్పున 34 రెయిన్‌గేజ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిడమనూరు చుట్టూ 70 కిలోమీటర్ల పరిధిలోని వర్షం, ఉష్ణోగ్రతలు, వాతావరణ మార్పులు ఎప్పటికప్పుడు శాటిలైట్ లింక్ ఆన్‌లైన్‌లో భారత వాతావరణ పరిశోధన కేంద్రం (ఐఎండీ)కీ పంపుతుందని తెలిపారు. రెయిన్ గేజ్ చుట్టూ ఉన్న చెట్లను తొలగించేందుకు అనుమతులు కావాలని తహసీల్దార్‌కు లేఖ అందజేశారు. రెయిన్ గేజ్‌ను పరిశీలించిన వారిలో తహసీల్దార్ జంగాల కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

మూసీకి తగ్గిన వరద

కేతేపల్లి: మూసీ ప్రాజెక్టుకు వరద తగ్గింది. ఎగువ ప్రాంతాల నుంచి 4,391 క్యూసెక్కుల వరదనీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరుతుంది. బుధవారం నాటికి 645 అడుగుల గరిష్ట నీటిమట్టం గల మూసీ రిజర్వాయర్‌లో 644.30 అడుగుల వద్ద ఉంది. నీటి మట్టం గరిష్టస్థాయికి చేరడంతో అధికారులు ప్రాజెక్టు మూడు క్రస్టు గేట్లను 2 అడుగుల మేర పైకెత్తి 3,884 క్యూసెక్కుల నీటిని దిగవ మూసీకి వదులుతున్నారు. కుడి, ఎడమ ప్రధాన కాల్వలకు 478 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గేట్లద్వారా, కాల్వలకు మొత్తం 4,362 క్యూసెక్కుల నీరు విడుదలవుతుంది. మూసీ రిర్వాయర్‌లో పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా ప్రస్తుతం 4.04 టీఎంసీల నీరు నిల్వ ఉందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

ఆ గ్రామాల్లో దసరా ప్రత్యేకం

యాదాద్రి భువనగిరి జిల్లాలోని రాజాపేట మండల కేంద్రంలో, రామన్నపేట మండలం లక్ష్మాపురం గ్రామంలో ప్రతి ఏడాది దసరా పండుగను ప్రత్యేకంగా జరుపుకుంటారు. లక్ష్మాపురం గ్రామంలో దసరా రోజు గ్రామస్తులు జాతీయ జెండాను ఎగురవేస్తారు. రాజాపేట మండల కేంద్రంలో ఠాకూర్ వంశస్తులు జాతీయ జెండా, తల్వార్లతో ర్యాలీగా జమ్మిచెట్టు వద్దకు వెళ్లి పూజలు చేస్తారు.

దసరా రోజు జాతీయ జెండా ఆవిష్కరణ



లక్ష్మాపురంలో దసరా రోజు జాతీయ జెండాను ఎగురవేసిన గ్రామస్తులు (ఫైల్)

రామన్నపేట: రాన్నపేట మండలం లక్ష్మాపురం గ్రామంలో దసరా రోజు జాతీయ జెండాను ఎగురవేస్తారు. గ్రామ పంచాయతీ ఏర్పడినప్పటి నుండి కచ్చీరు వద్ద జాతీయ జెండాను ఎగురవేసే సంప్రదాయం కొనసాగుతోంది. గ్రామానికి చెందిన పటేల్ వంశస్థులు పండుగ రోజు తెల్లవారుజామున పాత జాతీయ జెండాను అవనతం చేస్తారు. ఉదయం 10గంటల సమయంలో డప్పుచప్పుళ్లతో ఊరేగింపు నిర్వహించి కొత్త జెండా కర్రకు అలంకరణ చేసి కొత్త తాడుతో జాతీయ జెండాను ఎగర వేయడం జరుగుతుంది. జాతీయ పతాకావిష్కరణలో గ్రామస్తులంతా పాల్గొంటారు. జమ్మిచెట్టు వద్దకు పూజకు వెళ్లే సమయంలో అక్కడే పూజలు నిర్వహించి ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులకు, కులపెద్దలకు కంకణాలు అందజేస్తారు. జమ్మిచెట్టు నుంచి జాతీయజెండా వద్దకు తిరిగి వచ్చి ఒకరికొకరు జమ్మి పెట్టుకొని ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకుంటారు. అదేవిధంగా నిధానపల్లిలో బురుజుపైన, నీర్నెముల, శోభనాద్రిపురం, సిరిపురం గ్రామాల్లో గ్రామ పంచాయతీల వద్ద జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు.



రాజాపేటలో దసరా రోజు జమ్మి కోసం ప్రదర్శనగా వెళ్తున్న ఠాకూర్ వంశస్తులు (ఫైల్)

ప్రత్యేకంగా ఠాకూర్ వంశస్తులు

రాజాపేట : దసరా పండుగను రాజాపేట మండల కేంద్రంలో ఠాకూర్ వంశస్తులు ప్రత్యేకంగా జరుపుకుంటారు. చాలామంది హైదరాబాద్‌లో ఉంటున్నప్పటికీ పండుగ రోజు స్వగ్రామానికి విచ్చేసి వేడుకల్లో పాల్గొంటారు. రాజుల కాలం నుంచి గ్రామానికి చెందిన ఠాకూర్ వంశస్తులు దుర్గామాతకు నవ రాత్రులు పూజలు నిర్వహించి 9వ రోజు ఆయుధపూజ నిర్వహిస్తారు. సాంప్రదాయ దుస్తులు ధరించి గుర్రం(సిరిమల్లె) వంశీయులతో కలిసి డప్పువాయిద్యాలతో గడికోటలోని మైసమ్మ దేవాలయం వద్ద కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం జాతీయ జెండాను చేతబూని తల్వార్లతో ప్రదర్శన నిర్వహిస్తూ జమ్మి కోసం బయల్దేరుతారు. గ్రామం శివారులోని సంఘమేశ్వరస్వామి దేవాలయం వరకు చేరుకుని జమ్మి వృక్షానికి పూజలు చేస్తారు. పూర్వం మాత్రం ఠాకూర్ వంశానికి చెందిన సత్యనారాయణసింగ్ తనకున్న లైసెన్స్ గన్ భుజానికి వేసుకుని ఊరేగింపుగా వెళ్లి శమిపూజ తర్వాత గన్‌తో రెండుమార్లు తూర్పుదిక్కు గాలిలోకి పేల్చిన అనంతరం ప్రజలు జమ్మి తీసుకునేవారు. ఠాకూర్ సత్యనారాయణసింగ్ 1994 వరకు ఈ సాంప్రదాయాన్ని కొనసాగించారు.

నాణ్యమైన సేవలు అందిస్తాం



ఉద్యోగులను సన్మానిస్తున్న బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ వెంకటేశం తదితరులు

నల్లగొండ, రామగిరి(నల్లగొండ): బీఎస్ఎన్ఎల్ వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందిస్తామని ఆ సంస్థ ఉమ్మడి జిల్లా ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ పి.వెంకటేశం అన్నారు. బీఎస్ఎన్ఎల్ సిల్వర్ జూబ్లీ వేడుకల సందర్భంగా బుధవారం నల్లగొండ పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పానగల్ రోడ్డులోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా స్వదేశీ సాంకేతికతతో నిర్మించబడిన బీఎస్ఎన్ఎల్ మొబైల్ టవర్లను ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారన్నారు. ప్రజలకు చవక, నమ్మదగిన సేవలను అందిస్తూ బీఎస్ఎన్ఎల్ ముందంజలో ఉందని తెలిపారు. కొత్తగా ప్రవేశపెట్టిన ఎఫ్‌టీటీహెచ్ ప్యాకేజీలు రూ.299, రూ.399లో భాగంగా వినియోగదారులకు ఇంటర్నెట్, అపరిమిత వాయిస్ కాల్స్, టీవీ ఛానల్స్, ఓటీటీలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ఈ సందర్భంగా బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీజీఎం మురళీకృష్ణారెడ్డి, ఐఎఫ్ఏ సత్యనారాయణ, ఏజీఎం సుబ్బారావు, శాంతికుమారి, రాములు, సురేందర్, వెంకన్న, నరేందర్, జీవన్‌కుమార్, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

సాగర్‌కు తగ్గుముఖం పట్టిన వరద

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ జలాశయానికి ఎగువ నుంచి వస్తున్న వరద తగ్గుముఖం పట్టింది. ఎగువ నుంచి సాగర్ ప్రాజెక్టుకు 4,14,188 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. అంతే నీటిని సాగర్ జలాశయం నుంచి అధికారులు దిగువకు విడుదల చేస్తున్నారు. 26 రేడియల్ క్రస్ట్ గేట్ల ద్వారా 3,61,322 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పాదన ద్వారా 33,536, మొత్తం 3,94,858 క్యూసెక్కుల నీటిని దిగువకు కృష్ణానదిలోకి వదులుతున్నారు. కుడి, ఎడమ కాలువ, ఏఎంఆర్పీ, వరద కాలువలకు 19,330 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

NAME CHANGE

I, Jamandla Shekar Reddy, S/o Jamandla Malla Reddy, resident of 4-11-314/1, Chaitanyapuri Colony, Nalgonda, state that my name was incorrectly printed as "Jammalla Shekar Reddy" in my old Passport. The correct name is 'Jamandla Shekar Reddy" as per my Aadhaar and PAN Card. Both names refer to the same person - myself. Iam applying for Pass port renewal with the correct name. [SCA25008616]

REAL ESTATE

LAND FOR SALE

భూములు & ప్లాట్లు కొనబడును@ మహేశ్వరం, మన్‌సాన్‌పల్లి,నాగారం,దూబచర్ల, అమీర్‌పేట్, కొత్తూర్, కందుకూర్, పులిమామిడి,తుక్కుగూడ, శ్రీశైలంహైవే.9966521191 [SCA25008607]